ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

## పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 03 సంచిక -77 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 6 జులై 2026

# మెట్రోపై ప్రత్యేక చొరవ చూపండి

**● తెలంగాణకు ఫేజ్-1 ● అప్పగింతలో వేగం పెంచాలి ● ఫేజ్-2 నిర్మాణానికి తక్షణమే అమోదం తెలపాలి ● ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించండి ● ఆలస్యమయ్యేకొద్దీ ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదం ● కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వేర్వేరు లేఖలు**



**హైదరాబాద్,జూలై 5 రిపబ్లిక్ న్యూస్.** హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-1ను తెలంగాణకు బదిలీ చేసే విషయంలో వేగం పెంచాలనీ, ఫేజ్-2 నిర్మాణానికి తక్ష?ణమే ఆమోదం తెలపాలని ఆయన విన్నవించారు. ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేసే కొద్దీ మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదం ఉందని మిగతా2లో...

# నన్ను, పవన్‌ను తిట్టించడానికి వైసీపీ ఫండింగ్: సీఎం చంద్రబాబు



**హైదరాబాద్,జూలై 5 రిపబ్లిక్ న్యూస్.**మీడియాతో చిట్‌చాట్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తనను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను తిట్టించడానికి వైసీపీ పార్టీ సోషల్ మీడియా బ్యాచ్‌కి భారీగా ఫండింగ్ ఇస్తోందని అన్నారు. డబ్బులు ఎరచూపి తమపై దుష్ప్రచారం చేయిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతా2లో...

## వచ్చే మూడు రోజులు వర్షాలు..

**- హైదరాబాద్ వాతావరణ కేంద్రం**



**హైదరాబాద్,జూలై 5 రిపబ్లిక్ న్యూస్.**బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని, ఇది ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతానికి సమీపంలో కేంద్రీకృతమై మిగతా2లో...



## మజ్లిస్ అంటే భయమా? ప్రేమా?

**- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి**

**హైదరాబాద్,జూలై 5 రిపబ్లిక్ న్యూస్.** సల్కం చెరువు బఫర్ జోన్ లో బారిస్టర్ ఫాతిమా ఒవైసీ విద్యా సంస్థలు ఉన్నట్లు తీవ్ర ఆ రోపణలు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. మజ్లిస్ అంటే భయమా? ప్రేమా? లేక రెండూ ఉన్నా యా? అని ఆయన ఆదివారం 'ఎక్స్' వేదికగా రాష్ట్ర ప్ర భుత్వాన్ని ప్రశ్నించారు. మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకునే

మిగతా2లో...

# కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం మోటార్లు నడపడంలేదు?

**- వారం రోజులు అప్పగిస్తే రాష్ట్రమంతా నీళ్లు పారిస్తాం**

**● మేడిగడ్డతో అవసరం లేకుండానే కన్నెపల్లి నుంచి నీటి తరలింపు సాధ్యం ● ప్రభుత్వం స్పందించకుంటే 50వేల మందితో పంప్‌హౌస్ ముట్టడి : బీఆర్ఎస్ వర్కింగ్ ● ప్రెసిడెంట్ కేటీఆర్ పంప్‌హౌస్ పరిశీలన**



**మహదేవపూర్/అదిలాబాద్,జూలై 5 రిపబ్లిక్ న్యూస్.**కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను నడపడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతల బృందం జయశంకర్ ?భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించింది.. ఈ సందర్భంగా ?ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ప్రస్తుతం 98వేల క్యూసెక్కుల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని తెలిపారు. ఎంతటి కరువులోనైనా నీటి నిల్వ ఉండే అద్భుతమైన ప్రాంతం కన్నెపలి అని, మేడిగడ్డ మిగతా2లో...



## దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

**సియోల్,జూలై 5 రిపబ్లిక్ న్యూస్.** సౌత్ కొరియాలో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది. సియోల్‌లో ఇవాళ (ఆదివారం) మంత్రి లోకేశ్‌తో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కే, ఏఎస్ఐపీ-ఏపీఏసీటీ ఓశాట్‌ల ఆధారంగా ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0 కోసం చర్యలు చేపట్టాలని మిగతా2లో...

# మేడిగడ్డలో నీరు నింపడం అసాధ్యం

**ప్రమాదమని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించింది**

**పొరపాట్లను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం**

**2027 లోగా కాళేశ్వరం మరమ్మతులు పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**




**హైదరాబాద్, రిపబ్లిక్ న్యూస్.జూలై 05:** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఈ ఏడాది నీరు నింపడం సాధ్యం కాదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సచివాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 'మూడు బ్యారేజీల ఫౌండేషన్‌లో లోపాలున్నాయని నిపుణులు తెలిపారు. నీరు నిల్వ చేస్తే మేడిగడ్డ కొట్టుకుపోతుంది. భద్రాచలంతో పాటు దాదాపు 40 గ్రామాలు మునిగిపోతాయని ఇంజినీర్లు చెప్పారు. ప్రాజెక్ట్ నాణ్యతతో నిర్మించి ఉంటే వినియోగించేందుకు మాకు అభ్యంతరం లేదు. బ్యారేజీల గేట్లు దింపే మిగతా2లో...



## మేడిగడ్డపై బిఆర్ఎస్ నాయకుల రాజకీయ డ్రామాలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్, రిపబ్లిక్ న్యూస్. జూలై 05:** మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో బిఆర్ఎస్ నాయకులు రాజకీయ డ్రామాలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేయడం లేదని, ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ ఏకైక లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ, సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడం లేదని, ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వ లక్ష్యమని, కేంద్ర నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ స్పష్టమైన సూచనలు ఇచ్చిన తర్వాత కూడా

మిగతా2లో...

## ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఆ కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**● హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ● ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబాటు ● 361 మంది లబ్దిదారులకు 2 బీహెచ్‌కే పట్టాల పంపిణీ : మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్**




**హైదరాబాద్,జూలై 5 రిపబ్లిక్ న్యూస్.** ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేదలు ఉపాధి పొందుతున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహాలు నిర్మించి అందజేస్తామని తెలిపారు. ఇందుకోసం అవసరమైతే విలువైన ప్రభుత్వ భూములను కేటాయించడానికీ వెనుకాడబోమన్నారు. ఆదివారం హైదరాబాద్ జిల్లా మిగతా2లో...

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# మెట్రోపై ప్రత్యేక చొరవ చూపండి

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మనోహర్‌లాల్ ఖట్టర్, జి.కిషన్‌రెడ్డిలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం వేర్వేరుగా లేఖలు రాశారు. గత నెల 23, 24 తేదీల్లో కిషన్‌రెడ్డి సమక్షంలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్‌తో జరిగిన సమావేశాల్లో హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 బదిలీ, ఫేజ్-2 విస్తరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, వాటిల్లో ఏ ఒక్కటీ అమల్లోకి రాలేదని సీఎం ఎత్తిచూపారు. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ (ఎస్‌బీఐ క్యాప్స్)కు హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ, ఆర్థిక పరిస్థితుల సమీక్ష, తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు అవసరమైన ఆర్థిక పరిశీలన బాధ్యతలు అప్పగించేందుకు అంగీరించిన విషయాన్ని గుర్తుచేశారు.ప్రస్తుతమున్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ రుణాలుగా మార్చే రీఫైనాన్సింగ్ అవకాశాలను కూడా ఎస్‌బీఐ క్యాప్స్ పరిశీలించాలంటూ నిర్ణయించిన విషయాన్ని ప్రస్తావించారు. మెట్రో ఫేజ్-2 నిర్మాణానికి భారీ స్థాయిలో పెట్టుబడులు అవసరమవుతాయని వివరించారు. అందుకే అదే సంస్థ ద్వారా అవసరమైన ఆర్థిక నమూనా, దీర్ఘకాలిక రుణాలు, నిధుల సమీకరణ మార్గాలు, ప్రాజెక్టు అమలుకు కావాల్సిన ఆర్థిక వ్యూహాన్ని రూపొందించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ కోసం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)ను వెంటనే ఖరారు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ వ్యవహారాన్ని సమన్వయం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నోడల్ అధికారిగా నియమించినట్టు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు కేంద్రం ఎస్‌బీఐ క్యాప్స్‌ను అధికారికంగా నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను కూడా ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి పంపలేదని గుర్తుచేశారు.దీంతో మెట్రో ఫేజ్-1 బదిలీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందనీ, రోజువారీ నిర్వహణలో కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బీఐ క్యాప్స్ జాప్యం వల్ల మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు కేంద్ర అనుమతులు కూడా ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల నిధుల సమీకరణ ముందుకు సాగట్లేదనీ, ప్రాజెక్టు ప్రారంభం మరింత ఆలస్యమవుతున్నదని తెలిపారు. ఇలా ఆలస్యమయ్యే కొద్దీ ధరల పెరుగుదల, వడ్డీ భారం, నిర్మాణ సామగ్రి వ్యయం పెరగడం వంటి కారణాలతో ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటనీ, పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, విస్తరిస్తున్న నగర పరిధి, భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే మెట్రో విస్తరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఫేజ్-1 బదిలీ పూర్తయి, ఫేజ్-2 వేగంగా అమలైతే నగర ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా నగరాభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని తెలిపారు. కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని సీఎం కోరారు.

# కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం మోటార్లు నడపడంలేదు?

(మొదటి పేజీ తరువాయి)

బ్యారేజీతో అవసరం లేకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేసి ఫ్లడ్ ఫ్లో ద్వారా మిడ్ మా నేరు, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లికి నీటిని తరలించవచ్చని పేర్కొన్నారు. నీళ్లు ఇవ్వాలని రైతులు, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, రసమయి బాలకి షన్ కోరినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కన్నెపల్లి పంపులు ఆన్ చేస్తే నీళ్లు వస్తాయనే విషయం కాంగ్రెస్ నాయకులకు కూడా తెలుస న్నారు. ఒకవేళ నీళ్లిస్తే రైతులకు యూరియా, మద్దతు ధర, బోనస్, 24 గంటల కరెంట్ ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే రేవంత్ రెడ్డి సర్కార్ మోటా ర్లు ఆన్ చేయడం లేదని ఆరోపించారు. ఎన్డీఎస్ఏ నివేదికలను అడ్డం పెట్టుకు ని ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందన్నారు. కేసీఆర్‌కు వారం రోజు లు కాళేశ్వరం ప్రాజెక్టును అప్పగిస్తే రాష్ట్రమంతటా నీళ్లు పారిస్తామని సవాల్ విసిరారు. **హైదరాబాద్‌కు తాగునీటి సంక్షోభం** రాష్ట్రంలో 26 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తాము మూడు నెలల క్రితమే హెచ్చరించామని కేటీఆర్ గుర్తుచేశారు. ఉమ్మడి ఏడు జిల్లాలకు సాగునీటితో పాటు హైదరాబాద్ కు తాగునీరు అందించే సామర్థ్యం కాళేశ్వరానికి ఉందన్నారు. కాంగ్రెస్ చేతకానితనం వల్ల ప్రాజెక్టును పడావు పెట్టడంతో హైదరాబాద్‌లో రోజుకు 15 వేల వాటర్ ట్యాంకర్లు తిరుగుతున్నాయని అన్నారు. త్వరలోనే తీవ్ర తాగునీటి సంక్షోభం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రూ.94 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే .. అందులో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని ప్రచారం చేయడంపై కేటీఆర్ మండిపడ్డారు. 'సీఎం రేవంత్‌రెడ్డికి సోయి ... మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్పృహ ఉందా..అని ప్రశ్నించారు. కాళేశ్వరం వల్లే రాష్ట్రం వరి ఉత్పత్తిలో పంజాబ్‌ను దాటి నెంబర్ వన్ స్థానాని కి చేరిందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సుంకిశాల గోడ కూలినా, వట్టెం పంప్‌హౌస్ కొట్టుకుపోయినా, ఎస్ఎల్బీసీ టన్నెల్ కూలి ఎనిమిదిమంది చనిపోయినా పట్టించుకోని ప్రభుత్వం, కాళేశ్వరంపై మాత్రం విషం చిమ్ముతోందని ధ్వజమెత్తారు. కక్షపూరిత రాజకీయాలు పక్కన పెట్టి కన్నెపల్లి మోటర్లు నడపాలని, లేనిపక్షంలో 50 వేల మంది రైతులతో కలిసి పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పర్యటనలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. **కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటన ఉద్రిక్తం** కేటీఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటన సందర్భంగా జనగామ జిల్లా పెంబర్తి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పంప్‌హౌస్ సందర్శనకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన కేటీఆర్ కాన్వాయిను పెంబర్తి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి, కేటీఆర్‌తో పాటు వస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతుల వాహనాలను పలుచోట్ల నిలిపివేశారు. పెంబర్తి వద్ద రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కేటీఆర్ కాన్వాయి ముందుకు సాగలేకపోయింది. దీంతో కేటీఆర్ వాహనం దిగి పోలీసు అధికారులతో మాట్లాడారు. అంతలో అక్కడికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

# మేడిగడ్డలో నీరు నింపడం అసాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి లేదు. నీరు నిల్వ చేయకుండా ఎత్తిపోయడం సాధ్యం కాదు' అని ఉత్తమ్ ఈ సదర్భంగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతల కక్కుర్తితో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత కమీషన్ల కోసమే ప్రాణహిత ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చారని విమర్శించారు. ఎక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ కమీషన్లు వస్తాయని భావించి చేసిన తప్పిదం ఉత్తర తెలంగాణకు శాపంగా మారిందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.1.81లక్షల కోట్లు ఖర్చు చేసి లక్ష ఎకరాల ఆయకట్టుకు కూడా నీరివ్వలేక పోయారని ఎద్దేవా చేశారు. పాలమూరు రంగారెడ్డి, సీతారామ సాగర్, కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు, డిండీ మొదలగు ప్రాజెక్టలన్ని అసంపూర్తిగానే ఉన్నాయని గుర్తు చేశారు.తాము అధికారంలో వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వివరించారు. 'ఉల్టా చోర్ కొత్వాల్‌కు దండే' అన్నట్టుగా బీఆర్ఎస్ నేతల తీరు ఉందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది కూడా ఆయన హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు ఆన్ చేసి నీరివ్వాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టును సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. కాళేశ్వరం సమస్యను రాజకీయ కోణంలో కాకుండా ఇంజినీరింగ్ కోణంలో చూడాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అత్యంత కీలక అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం బాధ్యతారాహిత్య మని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2025 ఏప్రిల్ 24న కాళేశ్వరంపై ఎన్‌డీఎస్ఏ పూర్తి స్థాయి నివేదిక ఇస్తూ పలు సిఫారసులు చేసిందని మంత్రి గుర్తు చేశారు. అది చేసిన సూచనల మేరకు గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ సర్వేలు, 80 మీటర్ల లోతు వరకు బోర్ హోల్స్, హైడ్రాలిక్ మోడలింగ్, కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్, డిజిటల్ ట్విన్ సిమ్యులేషన్లు వంటి అత్యాధునిక పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పనులను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్), ఐఐటీ ముంబాయి, ఎన్‌డీఎస్ఏ, కేంద్ర జల సంఘం పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. భద్రతపై పూర్తి స్థాయి నమ్మకం వచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకొని పంపింగ్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. అపోహలు సృష్టించే రాజకీయ ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ వద్ద కనిష్ట పాండ్ లెవెల్ లేకపోవడంతో కన్నెపల్లి పంపింగ్ అసాధ్యంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో డిజైన్లను ఖరారు చేసి, వరదలు తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని వివరించారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఆ కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలతో కలిసి మంత్రి 361 మంది లబ్ధిదారులకు 2 బీహెచ్‌కే గృహాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. పేదలు వివిధ వృత్తుల ద్వారా ఉపాధి పొందుతున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహాలు నిర్మించి ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఇందుకోసం అవసరమైన ప్రభుత్వ భూములను వినియోగిస్తామని చెప్పారు. గత పదేండ్లుగా ఇండ్ల కోసం ఎదురుచూస్తూ పేదలు పడిన ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. ఆ ఆలస్యానికి ప్రభుత్వ ప్రతినిధిగా విచారం వ్యక్తం చేస్తున్నానని, ఇకపై సంక్షేమ పథకాల అమలులో జాప్యానికి తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు.అర్హులైన ప్రతి కుటుంబానికి 48 గంటల్లోనే రేషన్ కార్డు జారీ చేస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలో మరో రెండు లక్షల సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేయనున్నట్టు తెలిపారు.

వాంబే హౌసింగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కింద నిర్మించిన పాత భవనాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి వాటి స్థానంలో కొత్త గృహాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కొత్త ఇండ్ల కేటాయింపులో వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ.. పేదలకు శాశ్వత నివాసం కల్పించడం సామాజిక న్యాయంలో భాగమని, ప్రభుత్వం నిరంతరం పేదల పక్షాన నిలుస్తుందన్నారు.ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ.. మొత్తం 361 మంది లబ్దిదారులకు గృహాల పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు.

ఇందులో చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ మండలానికి చెందిన 187 మంది, నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన 79 మంది, నాచారం కాలనీకి చెందిన 95 మంది లబ్దిదారులు ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మినరల్ కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ కుమార్, వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మెన్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ, హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్, ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్ కుమార్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్, గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల అధికారులులు, పాల్గొన్నారు.

# నన్ను, పవన్‌ను తిట్టించడానికి వైసీపీ ఫండింగ్: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. రాష్ట్రంలో సైబర్ దాడులు, అసభ్య పోస్టులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# వచ్చే మూడు రోజులు వర్షాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. వచ్చే 24 గంటల్లో ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. దీని ప్రభావంతో వచ్చే మూడ్రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది.వర్షాలు కురిసే సమయంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నది. భారీ వర్షాలు కురుసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, రాబోయే మూడ్రోజులు గుజరాత్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లోని ప్రాంతాలకు విస్తరిస్తాయని వెల్లడించింది.

# మజ్లిస్ అంటే భయమా? ప్రేమా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని ఆయన దుయ్యబట్టారు. భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసం ఆరాటపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదని ఆయన దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ సెలక్టివ్ గవర్నెన్స్ (పక్షపాత పాలన)కు హైడ్రా ఓ ఉదాహరణ అని తెలిపారు.సామాన్య ప్రజల విషయంలో మాత్రం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బారిస్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం మౌనంగా ఉంటూ మీనమేషాలు లెక్కిస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా ప్రభుత్వ తీరులో రావడం లేదని, హైడ్రా, విద్యా శా ఖ సహా పలు శాఖల నుంచి వివరాలు కోరినా సామాన్య ప్ర జల విషయంలో చూపే తొందరపాటును ఫాతిమా కాలేజ్ వ్యవహారంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చూపించడం లేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మజ్లిస్ పార్టీని యా వత్ ముస్లిం సమాజానికి ప్రతినిధిగా భావిస్తున్నట్లుగా వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు. ఇది పూర్తిగా తప్పు. హైడ్రా చర్యల వల్ల పేద ముస్లింల ఇళ్లు కూడా కూల్చివేయబడ్డాయని, వారి జీవనోపాధి దెబ్బతిన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమయంలో వారి తరపున మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆ యన తెలిపారు.కానీ ఓవైసీ సోదరుల ఆస్తుల విషయంలో మాత్రం ఈ రెండు పార్టీలు ఒకే ఆలోచనతో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ముస్లిం సమాజంపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమలేదని, తమ మిత్రుడైన ఓవైసీకి ఇబ్బంది కలగకూడదన్నట్లుగా, మజ్లిస్ ప్రయోజనాలకు కాపాడేలా రేవంత్ సర్కారు వ్యవహరిస్తోందని స్పష్టంగా అర్థమవుతోందని ఆ యన పేర్కొన్నారు. ఫాతిమా విద్యా సంస్థల వ్యవహారం కాం గ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలను, మజ్లిస్ ద్వం ద్వ వైఖరిని బట్టబయలు చేసిందని ఈ రెండు పార్టీలకు తా ము ముస్లిం సమాజానికి ప్రతినిధులం అని చెప్పుకునే హ క్కులేదని ఈ విషయం తేటతెల్లం చేసిందని తెలిపారు.

# దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో మంత్రి లోకేశ్ భేటీ..

(మొదటి పేజీ తరువాయి)

గౌరంగలాల్ దాస్‌ని లోకేశ్ కోరారు. ఇందుకు అనుగుణంగా కొరియన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, చిప్ దిగ్గజాలను ఆంధ్రప్రదేశ్‌కు రప్పించేందుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఏపీలో శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలో రెడీ టు యూజ్ క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయని మంత్రి లోకేశ్ తెలిపారు. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయాలతో కలిసి కొరియా-అనుసంధాన నైపుణ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఏప్రిల్ 2026లో సౌత్ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ భారత్ పర్యటన సందర్భంగా 'కొరియా ఎన్‌క్లేవ్'కు సిద్ధంగా ఉన్నామన్నారు. కొరియన్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం ఉద్దేశించిన ప్లగ్-అండ్-ప్లే టౌన్‌షిప్‌కు శ్రీసిటీలో ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని ఈ సందర్భంగా గౌరంగలాల్ దాస్‌ను కోరారు. అనంతపురంలో కియా, హ్యుందాయ్ మోబిస్ ఆటో-ఈవీ క్లస్టర్‌ను విస్తరించడంపైనా వారిద్దరూ చర్చించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తీరంలో హెచ్‌డీ హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్, బ్యాటరీ/గ్రీన్-హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేశ్ సూచించారు. ఏపీ-సౌత్ కొరియా మధ్య సంబంధాల బలోపేతానికి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొరియా ప్లస్, ఖూ=ూా, భారత్-కొరియా పారిశ్రామిక సహకార కమిటీలను అనుసంధానిస్తూ ఒక ప్రత్యేక ఏపీ-కొరియా డెస్క్ ఏర్పాటు చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. 10న నిర్వహించే సియోల్ ఇన్వెస్టర్ రోడ్‌షో, +2+ అవగాహన ఒప్పందాల వైపు మళ్లించేలా చొరవ చూపాల్సిందిగా భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌కి మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# మేడిగడ్డపై బిఆర్ఎస్ నాయకుల రాజకీయ డ్రామాలు: మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి)



బిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీలో నీటిని నిల్వ చేయొద్దని, కన్నేపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు హెచ్చరించారని గుర్తుచేశారు.అయినప్పటికీ కెటిఆర్, కెసిఆర్‌లు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరంగా కాకుండా బిఆర్ఎస్ అవినీతికి ప్రతీకగా మారిందని ఆరోపించారు. లక్షన్నర కోట్లు ఖర్చుపెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరమైందన్నారు. మేడిగడ్డ కుంగిపోవడం, పంపులు మునిగిపోవడం, వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా కావడం బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతికి శాశ్వత సాక్ష్యాలన్నారు. ఇది నీళ్ల ఎత్తిపోతల పథకం కాదని, నిధుల ఎత్తిపోతల పథకమని తెలంగాణ ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. కెటిఆర్ ఒక మాట, కెసిఆర్ మరో మాట మాట్లాడుతున్నారని, నిజంగా తమ మాటలపై విశ్వాసం ఉంటే ఢిల్లీలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఎదుట తమ వాదనను నిరూపించాలని సవాల్ విసిరారు. మీడియా కెమెరాల ముందు డ్రామాలు చేయడం కంటే నిపుణుల ముందు నిలబడి సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం ప్రకటిత ఇంజినీర్ల మాటలు వినదని, నిపుణుల సూచనల మేరకే ముందుకుసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# వజ్రప్రహార్ కార్యక్రమంలో భాగంగా పాణ్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్- ప్రజలకు విస్తృత అవగాహన.

**పాణ్యం , ప్రతినిధి, జులై 05, ప్రజారిపబ్లిక్ న్యూస్,**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గంజా మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు చేపట్టిన ,వజ్రప్రహార్, ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా, నంద్యాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పాణ్యం మండలంలో విస్తృత తనిఖీలు మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.పాణ్యం, ప్రతినిధి జులై 05, ప్రజారిపబ్లిక్ న్యూస్, స్థానిక మండలంలోని ఇందిరా కాలనీ (చెంచు)లోఎస్పీ సునీల్ షోరాణ్ , ఐ పీ ఎస్ ఆదేశాలు, నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ కుమారి ఎం జావళి ఐ పి ఎస్, పర్యవేక్షణలో, పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో, పాణ్యం ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి మరియు పోలీసు సిబ్బంది పాణ్యం మండలంలోని చెంచు కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా అవగాహన సమావేశంలో మాదక ద్రవ్యాల (NDPS) నివారణ, రోడ్డు భద్రత మరియు



రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలు తదితర ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలపై గ్రామస్థులకు సమగ్ర అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ప్రజలు చట్టాలను గౌరవిస్తూ, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అదేవిధంగా, చెడు



ప్రవర్తన కలిగిన హిస్టరీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నేర కార్యకలాపాల్లో పాల్గొనరాదని హెచ్చరించి, సత్ప్రవర్తనతో సమాజంలో ఆదర్శ పౌరులుగా జీవించాలని సూచించారు.ప్రజల సహకారంతో మాదక ద్రవ్యాల నిర్మూలనతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కట్టుబడి ఉంటుందని పోలీసులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఏఎస్సై సురేష్ రెడ్డి మృతి



**పాణ్యం , ప్రతినిధి, జులై 05, ప్రజారిపబ్లిక్ న్యూస్,** పాణ్యం మండలం లోని తమ్మరాజుపల్లి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై)గా విధులు నిర్వహిస్తున్న సురేష్ రెడ్డి ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తమ్మరాజుపల్లె సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం.కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగినట్లు తెలిసింది. ప్రమాదంలో ఏఎస్సై సురేష్ రెడ్డి తీవ్రంగా గాయపడగా, అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.ఈ విషాద వార్త పోలీసు శాఖలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. విషయం తెలుసుకున్న సహచర పోలీసులు, స్నేహితులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, ప్రమాదానికి గల కారణాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

# తురకపల్లిలో ఎస్ఐఆర్ కార్యక్రమం



**అనంతపురం/గుత్తి, జూలై 5: (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి మండలంలోని తురకపల్లి గ్రామంలో ఆదివారం ఎస్ఐఆర్ (ఎస్‌పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు పూర్తి చేయడంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ పుణ్యవతి పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల నమోదు, సవరణలు, ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.
ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, వారి నుంచి పూర్తి సహకారం తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.
కార్యక్రమంలో ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, బీఎల్ఓ, అంగన్వాడి సిబ్బంది సచివాలయం సిబ్బంది, టిడిపి నాయకులు నాగిరెడ్డి, జైపాల్ రెడ్డి, నారాయణ,హనుమంత్ రెడ్డి బోయ శంకర్, చితంబర్ రెడ్డి, రాజు, తలారి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ కమిటీ, ఐఆర్ తక్షణమే ప్రకటించాలి

## జూలై 14న ర్యాలీ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 5)**
పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించి, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జూలై 14న జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు.ఈ మేరకు కర్నూలులోని యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర ఫ్యాప్టో కో-చైర్మన్ కాకి ప్రకాశ్‌రావు అధ్యక్షతన జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం జరిగింది.
ఈ సందర్భంగా కాకి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమానికి అనుకూలంగా పనిచేస్తామని హామీ ఇచ్చిందని, అయితే రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు 12వ పీఆర్‌సీ కమిటీని నియమించకపోవడంతో పాటు ఐఆర్‌పై కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు జూలై 14న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌కు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నిరసన కార్యక్రమంలో ప్రధానంగా నాలుగు డిమాండ్లు వినిపించనున్నట్లు తెలిపారు. 12వ పీఆర్‌సీని ప్రకటించడం, 30 శాతం ఐఆర్ మంజూరు



చేయడం, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయడం, ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షను రద్దు చేయడం వంటి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.
జిల్లా ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి జి. భాస్కర్ మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమానికి అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆర్థిక అంశాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందరూ నిరసనలో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు.ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్ బకాయిలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఏపీటీఎఫ్-257 జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాసింజీ మాట్లాడుతూ ప్రభుత్వం ఒకటో తేదీ జీతం చెల్లింపుతో సరిపెట్టుకుని ఇతర ఆర్థిక సమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు.
ఏపీటీఎఫ్-1938 జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షను రద్దు చేయాలని ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం స్పందించలేదని, ఈసారి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.
ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ అన్ని సంఘాలు ఐక్యంగా జూలై 14న నిర్వహించే ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమన్న మాట్లాడుతూ జూలై 14 ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం వద్దకు అందరూ చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లాలని తెలిపారు.ఈ సమావేశంలో నవీన్ పాటిల్ (యూటీఎఫ్), వెంకట్రాముడు (ఎస్టీయూ), మరియానందం (ఏపీటీఎఫ్-1938) తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలి

## జూలై 8న కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ మహిళా విభాగం ధర్నా: మీసాల సుమలత

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 5)**





అయోధ్య రామ మందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగంపై సమగ్ర, పారదర్శక విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఆలయానికి సంబంధించిన విరాళాల నిర్వహణలో పారదర్శకత అత్యంత ముఖ్యమని అన్నారు. విరాళాల వినియోగంపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడానికి స్వతంత్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.ఈ అంశంపై నిరసన తెలియజేస్తూ జూలై 8న ఉదయం కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఎలాంటి అవకతవకలైనా వెలుగులోకి వస్తే వాటిపై ప్రభుత్వం రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన కర్నూలు పోలీసులు

**నేర ప్రవృత్తికి స్వస్తి పలికి చట్టబద్ధమైన జీవనం సాగించాలని సూచన**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 5)**
జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి కర్నూలు పోలీసులు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు.
జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. కౌన్సిలింగ్ సందర్భంగా సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి పూర్తిగా స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసు



అధికారులు సూచించారు.ప్రశాంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నేరాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో కలిసి గౌరవప్రదమైన జీవితం గడపాలని అధికారులు





అవగాహన కల్పించారు.అలాగే, భవిష్యత్తులో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది





**మహానంది, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్)**
అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మహా గొప్పదని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇండియా స్టేట్ ప్రెసిడెంట్ పిఎన్ ఎస్ రాయుడు అన్నారు. ఆదివారం మహానంది మండలం గోపవరం గ్రామ సమీపంలోని మానసిక వికలాంగుల కేంద్రంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇండియా ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..హ్యూమన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.



# నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

## గుత్తిలో కుక్కలకు ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమం

**అనంతపురం/గుత్తి, జూలై 5: (రిపబ్లిక్ న్యూస్)**
పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం (జూలై 6) ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గుత్తి ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. భారతి తెలిపారు. ఈ సందర్భంగా జూనోటిక్ వ్యాధులపై ప్రజలు, పశుపోషకులు, పెంపుడు జంతువుల యజమానుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.
పశువుల నుంచి మనుషులకు, అలాగే మనుషుల నుంచి పశువులకు వ్యాపించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని ఆమె వివరించారు. రేబిస్, బ్రుసెల్లోసిస్, సిస్టిసర్కోసిస్, ఎన్సెఫలైటిస్, ఆంత్రాక్స్ వంటి వ్యాధులు



మానవులు, పశువులకు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటువంటి వ్యాధుల నివారణకు టీకాలు వేయించడం, పరిశుభ్రత పాటించడం, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని తెలిపారు.ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా గుత్తి ఏరియా పశువైద్యశాలలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ ఉచిత టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని గుత్తి పట్టణం, పరిసర ప్రాంతాల పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పి. భారతి కోరారు.

# స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలి

**పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు వెళ్లండి**

**గణేష్ కుమార్ యాదవ్ ఏఐసీసీ కార్యదర్శి**

**ఏపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి**



**అనంతపురం సంక్షేమం, జూలై 05,(రిపబ్లిక్ న్యూస్):** నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా డిసిసి అధ్యక్షుడు వై.మధు సూధన్ రెడ్డి గారి అధ్యక్షతన అనంతపురం జిల్లా, నగర పార్టీ శ్రేణులతో స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి గణేష్ కుమార్ యాదవ్ గారు మరియు కాంగ్రెస్ పార్టీ ఏపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను జిల్లా, నగర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ ఘనంగా శాలువా, పుష్ప గుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

**అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి**

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ జిల్లా, నగర కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తూ పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీలో చేరికలు చేపడుతూ ప్రతి ఒక్కరు శ్రమించాలని అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసే దిశగా ఐక్యంగా ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని చేసుకునే దిశగా ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిల రెడ్డి గారి నేతృత్వంలో ప్రతిఒక్కరు పార్టీ పిలుపు ఇచ్చే కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్లాలని తెలిపారు. అదేవిధంగా దేశంలో నెలకొన్న పరిస్థితులను, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాలను ప్రశ్నించాలన్నారు. అలాగే యువత, విద్యార్థుల సమస్యలు పై గళాన్ని వినిపించాలన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పార్టీ బిఎల్ఓ లు అప్రమత్తంగా ఉంటూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ ఇమామ్ వలి, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు దాదా గాంధీ, రాయదుర్గం ఇంచార్జ్ గౌనీ ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ఈరన్న, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి గొల్ల బొజ్జప్ప, యన్ ఎస్ యు ఐ నరేష్, కుందుర్పి మండల కన్వీనర్ గౌని తిప్పేస్వామి, కుందుర్పి మండల ప్రధాన కార్యదర్శి హనుమంత రాయుడు, ఓబీసీ మండల చైర్మన్ గోపాల్, డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, కళ్యాణదుర్గం నాయకులు దాదాపిర్, తాడిపత్రి ఇంచార్జ్ సూర్యనారాయణ, గుంతకల్లు డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు ఫిరోజ్, ఆలం నవాజ్, డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మాలిక్, నబీ రసూల్, వలి, అనంతపురం నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజీ బషీర్ అహ్మద్, పిండి భాష, యూసుఫ్, నూరుల్లా, అబ్దుల్, నరసింహా రెడ్డి, జాకీర్, ఇర్షద్, బాబా, మసాలా రవి, రియాజ్, హసీనా, అయేషా, గౌసియా, చైతన్య, చరణ్, ఆదినారాయణ, రాయదుర్గం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్, వసంత్, మహబూబ్ భాష, రఫీ, జోసెఫ్, వై సి వసంత్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధువు వరులను ఆశీర్వదించిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా



**బండి ఆత్మకూరు జూలై 05 (రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండలం నల్లమల్ల అటవీ ప్రాంతంలోని ఓంకారం సిద్దేశ్వర స్వామి ఆలయంలో జరిగిన వివాహానికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు,శ్రీశైలం అసెంబ్లీ ఇన్చార్జి మోమిన్ షబానా హాజరై నూతన వధువు వరులను ఆశీర్వదించారు.మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన భానుముక్కల వెంకటేశ్వర్లు ,శ్రీవాణి దంపతుల వివాహానికి హాజరై నూతన వధువు వరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బండి ఆత్మకూరు మండలం బీజేపీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి,మహానంది మండల బీజేపీ అధ్యక్షుడు కేఈ కిరణ్ కుమార్ గౌడ్,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# శ్రీశైలం నియోజకవర్గంలో ఓటర్ల అవగాహన కార్యక్రమం

**బండి ఆత్మకూరు,జూలై 05 (రిపబ్లిక్ న్యూస్ ):-** శ్రీశైలం నియోజకవర్గ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్ )కార్యక్రమంపై మోమిన్ షబానా బిఎల్ఏ 1 ఆధ్వర్యంలో ఓటర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 159, 160, 161, 162, 163, 164, 165 బూత్ల బిఎల్ఏ లతో కలిసి బండి ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన ప్రక్రియను ప్రజలకు వివరించారు.అనంతరం నిర్వహించిన బి ఎల్ ఏ సమావేశంలో సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అవసరమైన పత్రాలను సక్రమంగా సేకరించాలని, బూత్ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా చూడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, బి ఎల్ ఏ లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైభవంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె లగ్నపత్రిక సుముహూర్త వేడుక

**గుంతకల్ జూలై 05 (రిపబ్లిక్ న్యూస్ )**

ఈరోజు గుంతకల్ పట్టణం నందు గుంతకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చిన్న కుమార్తె మరియు ఆర్టీసీ రీజినల్ చైర్మన్ మరియు అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు కుమారుడు వివాహ సుముహూర్త లగ్నపత్రిక వ్రాయించు కార్యక్రమం గుంతకల్లు పట్టణం తిలక్ నగర్ నందు వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు గుమ్మనూరు జయరాం మరియు పూల నాగరాజు కుటుంబ సభ్యుల మధ్య అంగరంగ వైభవంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె లగ్న పత్రిక సుముహూర్తం ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా వేద పండితులు కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి లగ్నపత్రిక రాయడం జరిగింది ఈ సందర్భంగా ఇరువురి కుటుంబాలు మిఠాయిలు తినిపించుకుని ఘనంగా లగ్న పత్రిక సుముహూర్త కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు అలాగే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, సోదరులు గుంతకల్ ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి మరియు గుమ్మనూరు శ్రీనివాసులు ,ఎమ్మెల్యే తనయుడు యువనేత గుత్తి మరియు పామిడి టిడిపి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ మరియు టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మనూరు వెంకటేష్, కార్మిక శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ మరియు గుమ్మనూరు నారాయణ గుంతకల్లు నియోజకవర్గం కూటమి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరై కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# సోదరభావానికి ప్రతీకగా మొహరం వేడుకలు



**అనంతపురం/కంబదూర్, జూలై 5 (రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా కంబదూర్ మండలంలోని కొత్తమిద్దెల గ్రామంలో మొహరం పండుగ వేడుకలు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. హిందూముస్లిం సోదరభావానికి ప్రతీకగా జరిగే ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం చిన్న సరిగెత్తుతో ప్రారంభమైన ఉత్సవాలు, శుక్రవారం పానకాల కార్యక్రమంతో కొనసాగి, శనివారం జల్ది కార్యక్రమంతో ముగిశాయి.జల్ది సందర్భంగా పీర్లను గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకొని గ్రామాభివృద్ధి, ప్రజల సుఖశాంతి కోసం ప్రార్థించారు. సంప్రదాయ వాయిద్యాల నడుమ జరిగిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.వేడుకల్లో మాజీ ఎంపీటీసీ దండ వెంకటేశులు, టీడీపీ నాయకులు పాల్గొని పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, గుడి పూజారులు, ముల్లాలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రాజ్ న్యూస్ రిపోర్టర్ వన్నూరుస్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సేవాగడ్ నుంచి ఢిల్లీకి 'భారత్ బంజారా ఏక్త సంకల్ప యాత్ర' ప్రారంభం

**రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభం**

**బంజారా సమాజ ఐక్యతకు యాత్ర దోహదపడుతుందన్న మంత్రి**



**అనంతపురం/గుత్తి, జూలై 5: (రిపబ్లిక్ న్యూస్ )** గుత్తి మండల పరిధిలోని సేవాగడ్లో ఉన్న బంజారా ప్రజల అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రం, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జన్మస్థలం నుంచి న్యూఢిల్లీ వరకు చేపట్టిన చారిత్రాత్మక భారత్ బంజారా ఏక్త సంకల్ప యాత్ర ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు.యాత్ర ప్రారంభానికి ముందు ఆలయ కమిటీ ట్రస్ట్ సభ్యులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంతో పాటు సేవాగడ్లోని పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బాబా లఖీషా బంజారా, బాబా మఖన్ షా లుబానా జయంతి సందర్భంగా 21 రోజులపాటు నిర్వహిస్తున్న ఈ యాత్ర "ఒకే జెండా.. ఒకే గుర్తింపు.. ఒకే సంకల్పం" అనే నినాదంతో కొనసాగుతుందని తెలిపారు. బంజారా సమాజ ఐక్యత, సామాజిక చైతన్యం, సాంస్కృతిక పరిరక్షణకు ఈ యాత్ర నూతన దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులను అభినందించారు.

అంతకుముందు మాజీ మంత్రి, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్. రఘువీరా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్ గుప్తా సేవాగడ్ను సందర్శించారు. వారికి ఆలయ కమిటీ ట్రస్ట్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం దేవాలయాలు, పాఠశాలను సందర్శించిన వారు యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు (రిటైర్డ్ ఐజీ), మహారాష్ట్ర పోరాగడ్ ధర్మాధికారి బాబుసింగ్ మహారాజ్, కిషన్ రాథోడ్ (ముంబై), ఉమేష్ జాదవ్ (గుల్బర్గా), మాజీ ఎంపీ, ట్రస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, వైస్ ప్రెసిడెంట్ కేశవ్ నాయక్, అశ్వత్ నాయక్, జనరల్ సెక్రటరీ అశ్వర్థ్ నాయక్, ట్రెజరర్ బాల నాయక్, ఏఎస్ఎన్ మూర్తి, రంగ్లా నాయక్, డాక్టర్ శ్రీరాములు నాయక్, తిప్పయ్య నాయక్, ప్రవీణ్ కుమార్, ఏఐబీఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చక్రి నాయక్, ఏబీబీఎస్ అధ్యక్షుడు ఆంజనేయులు, కుమార్ నాయక్, యాదగిరి నరేంద్ర రాథోడ్, జీవీఎస్ఎస్ శివకుమార్ నాయక్, మల్లికార్జున నాయక్ బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ అశ్వర్థ్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా జరిగిన పత్తికొండ డి.ఎస్.పి వెంకటరామయ్య కుమార్తె వివాహం



**అనంతపురం/గుంతకల్ జూలై 05 (రిపబ్లిక్ న్యూస్)** ఈరోజు గుంతకల్ పట్టణం నందు గల పి ఎం ఆర్ ఎస్ ఫంక్షన్ హాల్ నందు డీఎస్పీ వెంకటరామయ్య కుమార్తె వివాహం ఘనంగా జరిగింది ఈ వేడుకకు హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి , మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప , వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్స్ ఎమ్మెల్యే ఎన్ గాదిలింగప్ప కుమారుడు ఎన్ గాదిలింగేశ్వర బాబు ( చిన్న బాబు) ,మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి , (ఎ డి సి సీ) మాజీ చైర్మన్ పామిడి వీర , వైసిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్లో 732వ ర్యాంకు సాధించిన గిరిజన విద్యార్థి రఘు నాయక్కు ఘన సన్మానం

**ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు పి. వెంకటప్ప అభినందనలు - గిరిజన విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్ష**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 5)**కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెరువు తాండ గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థి రఘు నాయక్ జేఈఈ మెయిన్స్లో అఖిల భారత స్థాయిలో 732వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటడంతో, ఆయనను ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు పి. వెంకటప్ప ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పి. వెంకటప్ప మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన రఘు నాయక్ కఠోర శ్రమతో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించడం గర్వకారణమని అన్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన గిరిజన విద్యార్థి సాధించిన ఈ విజయం గిరిజన యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.రఘు నాయక్ భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి కుటుంబానికి, గిరిజన సమాజానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిషన్ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, గిరిజన సంఘాల నాయకుడు ఈశ్వరయ్యతో పాటు పలువురు గిరిజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
సోమవారం 6 జులై 2026

# నూతన దంపతులకు కుట్టు మిషన్ల పంపిణీ

**మంత్రి సత్యకుమార్ యాదవ్**

**రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్**





**అనంతపురం/గుత్తి, జూలై 5: (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి మండలంలోని తొండపాడు గ్రామంలో పైలా నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత వివాహాలు చేసుకున్న నూతన వధూవరులకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పైలా నరసింహ యాదవ్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు కుట్టు మిషన్లను అందజేసిన మంత్రి మాట్లాడుతూ, పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఉచిత వివాహాలు నిర్వహించడంతో పాటు స్వయం ఉపాధికి దోహదపడేలా కుట్టు మిషన్లు అందించడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తున్న పైలా సేవలను కొనియాడారు.
వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ, అవసరమైన వారికి చేయూత అందించడం గొప్ప సేవ అని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు లక్ష్మీ రంగయ్య, జిల్లా ఇంచార్జ్ అంకుల్ రెడ్డి, రాయలసీమ కిషన్ మోర్చా జోనల్ ఇంచార్జ్ తెగ దొడ్డి తిమ్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బిసి ఎంకప్ప, చామంతుల ప్రేమ్ కుమార్. బావి గడ్డ ఓబులయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భయంతో ఉచ్చాపోసుకుంటున్నావ్

**మీసం తీసేస్తానన్నావు .. నువ్వు రెడ్డివేనా**

**మాదిగలారా... తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ఓడించండి -బి కే ఎస్ ఆనంద్**



**అనంతపురం అర్బన్,జూలై 05,(రిపబ్లిక్ న్యూస్):**
ప్రకాష్ రెడ్డి భయంతో చెప్పుకుంటున్నాడని బి కే ఎస్ ఆనంద్ అన్నారు. గత ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుస్తానే ధీమా వ్యక్తం చేశాడని అయితే ఓడిపోయిన తర్వాత తాను మీ తీసేస్తానని మాట ఇచ్చి మాట తప్పాడని నువ రెడ్డివేనా ప్రకాష్ రెడ్డి అంటూ చురకలంటించారు. అందులో భాగంగా శనివారంఎమ్మెస్ రాజు పై తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సవాళ్ల ప్రతి సవాళ్లతో దళిత సంఘాల నాయకులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారంరోడ్ల భవనాల శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.కే.ఎస్ ఆనంద్, చిన్నాంజనేయులు, చిన్నపెద్దన్న, పాలచెర్ల ముత్యాలప్ప, ఎంఎఆర్పీఎస్ ఫక్కిరప్ప,
ఈ సందర్భంగా బి.కే.ఎస్ ఆనంద్ మాట్లాడుతూ వైఎస్సార్సీపీకి ప్రతిపక్ష హోదా లేదని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప వారి వద్ద ఎలాంటి అంశాలు లేవని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ సమస్య వచ్చినా ఎంఎస్ రాజు ప్రజల పక్షాన నిలబడి సేవలు అందిస్తున్నారని, అలాంటి నాయకుడు తమకు గర్వకారణమని పేర్కొన్నారు. "ఎవరికి భయపడి ఊరు విడిచావు.. గతంలో నియోజకవర్గాన్ని నాశనం చేసింది మీరే.. ఇప్పుడు భయంతో ఉచ్చాపోసుకుంటున్నారు" అంటూ ప్రకాష్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మేము నిస్వార్థంగా పనిచేశాం. మీరు వేసుకున్న చెప్పులు కూడా మేమే తయారు చేశాం. మా ఓట్లతో గెలిచి ఇప్పుడు మమ్మల్నే విమర్శిస్తున్నావు. మగాడివైతే నిరూపించు. చందుకు అసలు భయపడను. పరిటాల సునీత నాపై గెలిస్తే మీసం తీసేస్తానన్నావు. నువ్వు రెడ్డివేనా? మా ఎంఎస్ రాజు ఇంకా గొప్ప నాయకుడు అవుతాడు" అంటూ సవాల్ విసిరారు. అలాగే మాదిగలారా... తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ఓడించండి అని పిలుపునిచ్చారు. చిన్నాంజనేయులు మాట్లాడుతూ ప్రకాష్ రెడ్డి ఎంఎస్ రాజుపై అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బాత్రూమ్‌లో నివాసము ఉన్న వారిని చూసి చలించిపోయి, పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత ఎంఎస్ రాజుదే అన్నారు. ఐదు పదవులు రావడంతో నీకు కడుపుమంట పెరిగిందని, భూస్వామివైతే దళితుల జోలికి రావొద్దు. వస్తే మహిళల చేత కొట్టిస్తాం అంటూ తీవ్ర హెచ్చరికలు చేశారు. చంద్ర మాట్లాడుతూ మేము జాంబవంతుడి వారసులం. ప్రకాష్ రెడ్డి మీసాలు తగ్గించుకో. టైం, డేట్ ఇచ్చాము నిరూపించకపోతే నీ ఇంటిని ముట్టడిస్తాం. ఖబద్దార్ అంటూ హెచ్చరించారు.

# వింబుల్డన్‌లో సంచలనం..

# వరల్డ్ నెం.1 సబలెంకాకు షాకిచ్చిన ఒసాకా



వింబుల్డన్ 2026 టోర్నమెంట్‌లో పెను సంచలనం నమోదైంది. జపాన్ టెన్నిస్ స్టార్, మాజీ ప్రపంచ నంబర్ వన్ నయోమి ఒసాకా అద్భుత ప్రదర్శనతో అగ్రశ్రేణి క్రీడాకారిణి అరినా సబలెంకాకు షాకిచ్చింది. సెంటర్ కోర్టులో ఆదివారం జరిగిన నాలుగో రౌండ్ పోరులో ఒసాకా 6-2, 7-6(2) తేడాతో సబలెంకాను ఓడించి, తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. గంటా 28 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఒసాకా సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. దూకుడైన బేస్‌లైన్ ఆటతో తొలి సెట్‌ను 6-2తో సులభంగా గెలుచుకుంది. రెండో సెట్‌లో సబలెంకా గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించిన ఒసాకా టైబ్రేక్‌లో విజయం సాధించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. కాగా, సబలెంకాపై ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒసాకాకు ఇదే తొలి విజయం కావడం విశేషం. చివరిసారిగా 2018 యూఎస్ ఓపెన్‌లో ఆమెపై ఒసాకా గెలిచింది. ఈ ఓటమితో సబలెంకా జైత్రయాత్రకు బ్రేక్ పడింది. 2022 యూఎస్ ఓపెన్ నుంచి వరుసగా 14 గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన ఆమె రికార్డుకు ఇక్కడ తెరపడింది. నాలుగుసార్లు మేజర్ ఛాంపియన్ అయిన ఒసాకా, ఈ విజయంతో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకుంది. ఈ ఏడాది జరిగిన నాలుగు గ్రాండ్‌స్లామ్‌లలోనూ ఆమె రెండో వారానికి (సెకండ్ వీక్) అర్హత సాధించింది. ఈ ఫలితంతో మహిళల సింగిల్స్ విభాగంలో ఈసారి కొత్త ఛాంపియన్ ఆవిర్భవించడం ఖాయమైంది.

# బేతంచెర్ల మండల కేంద్రంలో ఆస్తి కోసం

# కన్న తల్లిని మోసం చేసిన కుమారుడు

**పొలం కోసంబుగ్గన్న శంకరమ్మ ను మోసం చేసి కుమారుడుబుగ్గన చంద్రశేఖర్ రెడ్డి**

**మాకు జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ మండల ఎమ్మార్వో మాకు న్యాయం చేయాలి**



**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 5 (రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాల జిల్లా బేతంచెర్ల మండల కేంద్రంలో ఆస్తికోసం కన్నతల్లిని మోసం చేసిన కుమారుడు,2015 వ సంవత్సరంలో నా కొడుకు నాకు పింఛను ఇప్పిస్తానని రేషన్ కార్డు ఇప్పిస్తానని నాతో సంతకాలు చేపించుకున్నాడు నన్ను మోసం చేశాడు, వంశపారంపర్యంగా అందరికి రావాల్సిన పూర్వపు ఆస్తిని మా జేజి గారైన బుగ్గన శంకరమ్మ నుంచి దురుద్దేశ పూర్వకంగా ఆ ఆస్తి బుగ్గన శంకరమ్మకు కుమారులు మేము ఐదు మంది కుమారులం, అందులో ఒక కుమారుడు మొత్తం ఐదవ సోదరుడైన బుగ్గన చంద్రశేఖర్ రెడ్డి ఒక్కరే పింఛను ఇప్పిస్తాను రేషన్ కార్డు పెట్టిస్తాను అనితన తల్లి బుగ్గన శంకరమ్మను మోస పూర్వకంగా,ఆస్తిని దగా చేయాలనే ఏకైక ఉద్దేశ్యంతో పిలుచుకొనిపోయి మొత్తం 8 ఎకరాల ఆస్తిని తానే మొదట రిజిస్టర్ చేయించుకొని మరుసటిరోజు అదే ఆస్తిని తన ఏకైక కుమారుడు బుగ్గన ఉదయకిరణ్ రెడ్డికి దాన విక్రయం కింద ఆమె తల్లి గారైనా బుగ్గన శంకరమ్మ చేత మోసపూరితంగా రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ విషయం 2023 సంవత్సరంలో మిగతా కుమారులు అయిన బుగ్గన సీతారామిరెడ్డి,బుగ్గన భాస్కరరెడ్డి కి తెలిసి వెంటనే ఇలా చేయడం తప్పు,ఇది చట్టవిరుద్ధంగా నేరం అని బుగ్గన చంద్రశేఖరరెడ్డిని నిలదీసి తిరిగి నీతో పాటు మా ఇద్దరి పేరిట ఆ 9 ఎకరాల ఆస్తిని రిజిస్టర్ చేయించి ఇవ్వాలని మర్యాదపూర్వకంగా అభ్యర్థిస్తే,వినయపూర్వకంగా అడిగితే నాకు 10 రోజులు టైం ఇవ్వండి మన ముగ్గురి పేరిట ఈ 9 ఎకరాల ఆస్తిని రిజిస్టర్ చేయించుకుందామని హామీ ఇచ్చారు, ఇచ్చినప్పటికి,ఆ హామీ మీద నిలబడకుండా మాట తప్పడమే కాదు తాను తన భార్య,కుమారుడితో కలిసి దాదాపు 2 సంవత్సరాలు బేతంచెర్ల నగరాన్ని వదిలిపెట్టి కనపడకుండా ఎక్కడికో దూరప్రాంతానికి వెళ్లిపోయారు. అప్పుడు మేము చట్టపరంగా మా జేజి బుగ్గన శంకరమ్మను ఆర్.డి.ఓ వెంకటరెడ్డి దగ్గరకు తీసుకుపోయి ఆయన సమక్షంలో చటబద్ధంగా బుగ్గన చంద్రశేఖరరెడ్డి మోసపూర్వకంగా చేసుకున్న రిజిస్టర్ ను క్యాన్సల్ చేయించి,రద్దు పరచి మా అందరి పేరిట రిజిస్టర్ చేయించుకొని ఆన్ లైన్ సైతం చేయించుకున్నాము. అయితే ఆ తరువాత బుగ్గన చంద్రశేఖరరెడ్డి & అతని భార్య బుగ్గన జయలక్ష్మి దేవి కుమారుడు బుగ్గన ఉదయ్ కిరణ్ రెడ్డి 2025 వ సంవత్సరంలో బేతంచెర్ల నగరంలోకి రావడమే కాదు తమ వ్యాపారాలను చూసుకుంటూ ఉండటమే కాదు, మేము మా బాగానికి చెందిన ఆస్తిని ప్లాట్ల వ్యాపారం చేసే వారికి అమ్మేశాము. అయితే ఆ ప్లాట్లు రిజిస్ట్రేషన్ కాకుండా ఎం.ఆర్.ఓ ఆఫీస్ లో బ్లాక్ చేశారు బుగ్గన చంద్రశేఖర్ రెడ్డి వారి కుటుంబసభ్యులు బుగ్గన జయలక్ష్మి దేవి,వారి కుమారుడు బుగ్గన చంద్రశేఖర్ రెడ్డి నువ్వు చేసేది చట్టవిరుద్ధం ఇది చట్టరీత్యా సరిఅయినది కాదు ఈ ఆస్తిని మన ముగ్గురం తిరిగి రిజిస్టర్ చేయించుకుందాం అని బుగ్గన చంద్రశేఖరెడ్డిని మిగతా ఇద్దరు అన్నదమ్ములు అయిన బుగ్గన సీతారామిరెడ్డి,బుగ్గన భాస్కరరెడ్డి ఎన్నోమార్లు విన్నవించినప్పటికి పరిస్థితి చెవిటోడి ముందు శంఖం ఊదినట్లు తయారై వారి నుంచి కనీస స్పందన రాలేదు. అందుకే ఈ విషయాన్నీ బేతంచెర్ల నగరంలోని రిపోర్టర్ల దృషికి తీసుకువెళ్లడమే కాదు బేతంచెర్ల పట్టణానికి చెందిన సిఐ దృష్టికి సైతం తీసుకెళ్ళడం జరిగింది. అయితే సిఐ నాకు ఒక వారం రోజులు టైం ఇవ్వండి మీ సమస్యకు పరిష్కారం నేను చేస్తాను అని హామీ ఇచ్చారు. అయితే సిఐ దగ్గర సైతం మా సమస్యకు పరిష్కారం లభిస్తుందని మేము భావించడం లేదు. అందుకే ఈ ఆస్తి విషయాన్ని మేము కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లదలిచాము, మాకు అధికారులేన్యాయం చేయాలని కోరడం కోరుచున్నాము

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

**: జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

**కర్నూలులో ప్రత్యేక (సార్) శిబిరాలను పరిశీలించిన జేసీ**

**అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 5)**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక (సార్) శిబిరాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. నగరంలోని రామచంద్ర మిషన్ సమీపంలోని స్వర్ణవార్డు47 సచివాలయం, కేంద్రీయ విద్యాలయ పాఠశాల, బిషప్ చర్చ్ సెయింట్ జోసెఫ్ పాఠశాల, సోమిశెట్టి నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలోని స్వర్ణవార్డు47, డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన శిబిరాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.
ప్రజలు సమర్పించే దరఖాస్తులు, అవసరమైన ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి వెంటనే సంబంధిత పోర్టల్‌లో డిజిటలైజ్ చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు.
గ్రామాలు, వార్డులు, కాలనీల్లో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు (బిఎల్వో లు) మరియు ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి బీఎల్ఓకు సహాయకులుగా ఐసీడీఎస్, మెప్మా, డ్వామా, డీఆర్డీఏ తదితర శాఖల సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొంటూ, వారి సేవలను సమర్థంగా వినియోగించి (సార్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఎఈ తనిఖీల్లో కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రకాష్ రెడ్డిని చంపడానికి కుట్ర

**దళితబిడ్డకు న్యాయం చేసావా**

**రూ.7 కోట్ల విల్లా అగ్రిమెంట్ మరిచావా**

**కులాన్ని అడ్డుపెట్టి గెలిచావ్ ..**

**రీ కౌంటింగ్ పెట్టు చూసుకుందాం**

**చెలరేగిన జెడ్పీటీసీ చంద్ర శేఖర్**



**అనంతపురం ప్రతినిధి, జూలై 05,( రిపబ్లిక్ న్యూస్ ):**
తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ని హత్య చేయడానికి కుట్ర జరిగిందని జెడ్పిటిసి చంద్రశేఖర్ మండిపడ్డారు. శనివారం మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. దీంతో పాలకవర్గం నాయకులు ఒకవైపు, ప్రతిపక్షం నాయకులు మరోవైపు మాటల యుద్ధంతో జిల్లా రాజకీయాలు వేడెక్కాయి. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం వైయస్సార్సీపి పార్టీ ప్రధాన కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు.

**రూ.7 కోట్ల విల్లా, ఆస్తులు, రిజిస్ట్రేషన్ కాలేదనే విర్రవీగావ్**

ఈ సందర్భంగా జెడ్పిటిసి చంద్రశేఖర్ చెలరేగి మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారును ఢీకొన్న ఘటన సాధారణ ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా జరిగిన హత్యాయత్నమేనని జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ ఘటనపై అధికార పార్టీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ, ఎంఎస్ రాజుపై ఘాటు విమర్శలు గుప్పించారు.
ప్రకాష్‌రెడ్డిని చంపాలనే కుట్రతోనే కారు ఢీకొట్టిన ఘటన జరిగిందని చంద్రశేఖర్ అన్నారు. అలాంటి సమయంలో బాధితుడికి అండగా నిలవాల్సిన వారు ఘటనను తేలికగా తీసుకోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. హత్యాయత్నం జరిగితే దానిని ఖండించకుండా రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఎంఎస్ రాజు గతంలో చేసిన ఆస్తుల వ్యవహారాలు, రూ.7 కోట్ల విల్లా అగ్రిమెంట్ అంశం, కళాకారుల కాలనీలో సంపాదించిన ఆస్తులపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలు లేవని చెప్పడం ద్వారా నిజాలు మారిపోవని, ప్రజలకు అన్ని విషయాలు తెలుసని వ్యాఖ్యానించారు.

**దళిత యువతికి**
**జరిగిన అన్యాయంపై ఎందుకు స్పందించలేదు**

దళితుల హక్కుల పేరుతో మాట్లాడే నాయకులు నిజంగా దళితులపై జరిగిన అన్యాయాల సమయంలో ఎక్కడ ఉన్నారని చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఏడుగుర్రలపల్లిలో దళిత యువతికి జరిగిన అన్యాయంపై ఎందుకు స్పందించలేదని నిలదీశారు. కుల రాజకీయాలు మాట్లాడే ముందు దళితులకు జరిగిన అన్యాయాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రకాష్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలిచారని, అనుమానాలు ఉంటే రీ కౌంటింగ్‌కు రావాలని చంద్రశేఖర్ సవాల్ విసిరారు. ప్రజలు నిజంగా ఎవరికి ఓట్లు వేశారో తేల్చుకుందామని అన్నారు. అవసరమైతే పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే తానే మడకశిరలో ఎంఎస్ రాజుపై పోటీకి సిద్ధమని ప్రకటించారు. రాజకీయాల్లో శాశ్వతంగా అధికారంలో ఎవరూ ఉండరని, ప్రజల తీర్పే అంతిమమని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలు, కుల ప్రస్తావనలు, బెదిరింపు ధోరణి మానుకోవాలని సూచించారు. ఎల్లకాలం పార్టీ అండగా ఉండదునీ ఇష్టసారంగా మాట్లాడితే నాలుక కోస్తా అని చందర్ శేఖర్ హెచ్చరించాడు.

# జులై 10న రాష్ట్ర వ్యాప్త జరిగే విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయండి

## పి డి ఎస్ యు డివిజన్ అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్

**జహీరాబాద్ ప్రతినిధి జులై 5( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు డివిజన్ కమిటీ సమావేశాన్ని డివిజన్ ఆఫీసులో డివిజన్ కార్యదర్శి ఈ గోపాల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈనెల 10న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బందులు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బందుకు పిలుపునివ్వడం జరిగింది. ఈ సమావేశ నిర్దేశించి పి డి ఎస్ యు డివిజన్ అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ మాట్లాడుతూ... వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జులై 10 వ తేదీన కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్ కు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు, సకాలంలో పుస్తకాలు అందించాలని, ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని,



యూనివర్సిటీలలో మిస్ బకాయిలు రద్దు చేయాలని, నర్సింగ్ విద్యార్థినులకు ఉచితంగా హాస్టల్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ విద్యలో డొనేషన్స్ వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పలు డిమాండ్లతో బందుకు పిలుపునివ్వడం జరిగింది అని తెలిపారు. కావున ఈ బందులో ప్రభుత్వ ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలు కళాశాలలు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పి డి ఎస్ యు డివిజన్ నాయకులు అనిరుద్. రెహాన్, సుమన్, గోపాల్, రాకేష్ ,సురేష్, రమేష్ ,నరేందర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు

# జనసేన నిర్మాణ సాధన సమాచార సేకరణ విజయవంతం

## 2029 లక్ష్యంగా పార్టీ బలోపేతమే ధ్యేయం : తేజ రాయల్







**అనంతపురం ప్రతినిధి, జూలై 05,(రిపబ్లిక్ న్యూస్):**
జనసేన పార్టీ నిర్మాణ సాధన సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా గత వారం రోజులుగా నిర్వహించిన విస్తృత పర్యటనలు, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీ నిర్మాణం, సంస్థాగత బలోపేతం కోసం సేవ చేయాలనే ఆసక్తి ఉన్న సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు నాయకులు తెలిపారు.



ఈ కార్యక్రమానికి పరిశీలకుడిగా వేములపాటి అజయ్ కుమార్ వ్యవహరించగా, పార్లమెంట్ పరిధిలోని మహిళలు, యువతతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సమాచార సేకరణ కమిటీ సభ్యులుగా నియమించారు. ముగింపు కార్యక్రమాన్ని అనంతపురం నగరంలోని 15వ డివిజన్ ఇన్‌చార్జ్ తేజ రాయల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేములపాటి అజయ్ కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్‌కు అట్టహాసంగా స్వాగతం పలికారు.
కార్యక్రమ విజయానికి విశేషంగా కృషి చేసిన జనసేన వీర మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం పరిశీలకుడు వేములపాటి అజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, 15వ డివిజన్ ఇన్‌చార్జ్ తేజ రాయల్, వీర మహిళలు శైలజా, శరణ్య, వాల్మీకి మంజుల తదితరులు నిర్మాణ సాధన సమాచార సేకరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

### పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తా

ఈ సందర్భంగా తేజ రాయల్ జనసేన పార్టీ నగర అధ్యక్ష పదవికి సమాచార సేకరణ కమిటీకి వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, పార్టీ పెద్దలు అవకాశం కల్పిస్తే సామాన్య ప్రజలను కలుపుకుని పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. పదవి ఉన్నా లేకపోయినా పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.
చిరంజీవి, పవన్ కళ్యాణ్ కుటుంబాలకు తాను ఎప్పటి నుంచో అండగా ఉంటూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని తేజ రాయల్ పేర్కొన్నారు. జనసేన ఆవిర్భావం నుంచి పవన్ కళ్యాణ్ చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు, ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకుంటున్న నిర్ణయాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని, అందుకే పార్టీకి విధేయుడిగా సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సమాజంలోని వివిధ వర్గాలు, వివిధ వృత్తులకు చెందిన ప్రజలు జనసేన పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తోందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో జనసేనను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి జనసైనికుడు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చూడడమే తమ ఏకైక లక్ష్యమని తేజ రాయల్ స్పష్టం చేశారు.

# వైసిపి కంచుకోటకు బీటలు

## రూపానంద రెడ్డి సమక్షంలో టిడిపిలోకి చేరికలు.

**రైల్వే కోడూరు జూలై 5 రిపబ్లిక్ న్యూస్.**
గత 50 సంవత్సరాలుగా రాజారెడ్డి అయనతనయుడు మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అయనమరణానంత్రము వైయస్ జగన్మోహనరెడ్డి వారివేంటే కష్ట నష్టాలకు ఓర్చి నడిచాము ఏవిధంగాను ఎదగలేకపోయము అందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభి వృద్ధి పథకాలు అయన ఆశయాలు, ఆదర్శలు ముందుచూపు నచ్చి 50 సంవత్సరాల ప్రస్థానానికి స్వస్తి పలికి వై సి పి ని వదలి సైకిలెక్కడం జరిగినది,
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, లింగిరెడ్డిపల్లి గుండు శివారెడ్డి ల ఆధ్వర్యంలో మండల కేంద్రం ఓబులవారిపల్లి కి చెందిన సుమారు 30 కుటుంబాలు కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుముక్కా రూపానంద రెడ్డి సమక్షంలో వైసిపి నాయకులు నూక పాపు గారి శ్రీనివాసరెడ్డి, నూక పాపు గారి బాబుల్ రెడ్డి, మురళీమోహన్ రెడ్డి, కంచర్ల నారాయణరెడ్డి,విశ్వ రెడ్డి, శివారెడ్డి, పోలి రాజారెడ్డి. నందలూరు హరికృష్ణ రెడ్డి, తదితర నాయకులు కార్యకర్తలు వైసీపీనివీడి తెలుగుదేశం పార్టీకి జై కొట్టడం జరిగినది సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ఘన స్వాగతం పలికిన ఓబులవారిపల్లి నాయకులకు ప్రజలకు కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని అడుగడుగునా మీకు పార్టీ నేను అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీని కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళుతుందని రూపానంద రెడ్డి,అన్నారు, ఓబిలి ప్రసాద్ రెడ్డి, నూక పాపు గారి బాబుల్ రెడ్డి, ఓబిలి శ్రీధర్ రెడ్డి ,తదితరులు





కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు గత 20 సంవత్సరాల పైగా రైల్వే కోడూరు ను శాసించిన వైసిపి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించి జనసేన పార్టీ రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని హస్త గతం చేసుకున్నది, అది రూపానంద రెడ్డి యొక్క పట్టుదల కృషి నాయకత్వ లక్షణం అని అలాగే ఓబులవారిపల్లి పంచాయతి వైసీపీకి తిరుగులేకుండా ఉండేదని ఇప్పుడు చంద్రబాబు నాయుడు చేసి చూపెడుతున్న అభివృద్ధి రూపానంద రెడ్డి నాయకత్వం ఓబులవారిపల్లెలో తిరుగులేని వైసీపీకి బీటలు పడేలా చేసిందని రాబోయే స్థానిక సంస్థలఎన్నికల్లో టిడిపిని గెలిపించి టిడిపికి కంచుకోటగా నిలుపుతామని ఓబిలి ప్రసాద్ రెడ్డి శ్రీధర్ రెడ్డి నూక పాపు గారి బాబు రెడ్డి లింగిరెడ్డిపల్లి శివారెడ్డి రూపానంద రెడ్డికి హామీ ఇవ్వడం జరిగినది శ్రీఅంతకుముందు కూడా చైర్మన్ రూపనంద్ రెడ్డి ఓబులవారిపల్లి టిడిపి నాయకుడు శ్రీధర్ రెడ్డి ఇంటికి చేరుకోగా ఆయనకు ఆయన సతీమణి వరలక్ష్మి ఆయన కుమారుడు యువనేత సాయి వికాస్ రెడ్డి లను శాలువాకప్పి ఓబిలి శ్రీధర్ రెడ్డి ఘనంగా సత్కరించడం జరిగినది, కార్యక్రమంలో ఓబులవారిపల్లి మాజీ ఎంపీపీ రాజు వాసుదేవ రెడ్డి కావుటూరి గజేంద్రనాయుడు మైనారిటీ నాయకుడు షేక్ వల్లి గాజులు ఎంపిటిసి పనింద్ర వెంకటేష్ ఆచారి పుల్లంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపేర్ల చంద్రశేఖర్ నాయుడు , ఓబిలి శ్రీనివాసరెడ్డి సునీల్ రెడ్డి, బండి కిష్టయ్య నాగేంద్ర నాయుడు బత్తిన వేణుగోపాల్ రెడ్డి తల్లెం రమణారెడ్డి, కొత్తపల్లి జనార్ధన్, పలువురు నాయకులు కార్యకర్తలు ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిని మర్యాదపూర్వకంగా కలిసిన టీవైజేఎఫ్ సంగారెడ్డి జిల్లా యూనియన్ సభ్యులు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 5( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో, రాష్ట్ర అధ్యక్షునిని సంగారెడ్డి జిల్లా యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అశోక్ సామ్రాట్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, ఆందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి బాగయ్య, ఉపాధ్యక్షుడు బుచ్చయ్య, కోశాధికారి నాగరాజు, ఆర్గనైజర్ సెక్రటరీ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అందోల్‌జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ వార్డులో బోరు తవ్వకం ప్రారంభం





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 5 ( ప్రజా పబ్లిక్ న్యూస్)**
అందోల్‌జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ వైస్ చైర్మన్ వార్డులో ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరు తవ్వకం పనులు ప్రారంభమయ్యాయి. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు వార్డు ప్రజల సమక్షంలో ప్రారంభించారు.బోరు తవ్వకం పూర్తయిన అనంతరం వార్డు ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ జిశాన్ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఖాలేదు, చోటుఖాన్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సియంఆర్ఎప్ చెక్కులు పంపిణీ చేసిన సర్పంచ్ తీట్ల లహరి రాజేష్

**మల్లాపూర్ జూలై 5 (రిపబ్లిక్ న్యూస్)**
కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆదేశాల మేరకు ఈరోజు రేగుంట గ్రామంలో సిరిపురం వికాస్, సిరిపురం రమ్య గార్లకు 16,500 విలువ గల సియంఆర్ఎప్ చెక్కులను అందించిన రేగుంట సర్పంచ్ తీట్ల లహరి రాజేష్. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కత్తి నరేష్, కలసాని రాజన్న, మహమ్మద్ బషీర్, బాస రాజరెడ్డి, నాయకులు సురకంటి తిరుపతి రెడ్డి, మూడంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# SIR హెల్ప్ డెస్క్‘ పై ప్రతిపక్షాల ఆరోపణలు కాకిగోలే

## మెదక్ ఎంపీ రఘునందన్ రావు

### దౌల్తాబాద్‌లోని హెల్ప్ డెస్క్‌ను సందర్శించిన ఎంపీ- ఎన్నికల సంఘానికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు -ఈకార్యక్రమంలో భారీగా పాల్గొన్న బీజేపీ శ్రేణులు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 5 (రిపబ్లిక్ న్యూస్)**దౌల్తాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న »SIR హెల్ప్ డెస్క్‘ కార్యక్రమాన్ని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ‘హ×=‘ పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విపక్షాల విమర్శలన్నీ అర్థరహితమని, అవన్నీ కేవలం కాకిగోల లాంటివని ఆయన కొట్టిపారేశారు. ప్రజలు ఎంతో ఉత్సాహంగా, స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటూ ఎన్నికల సంఘానికి పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. హెల్ప్ డెస్క్ ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది మల్లేష్ గౌడ్, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు నాగప్రభు గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు పార్టీ ప్రముఖ నాయకులు సురేష్, రమేష్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, రాగి రాములు, బిట్లా మహేష్ మరియు పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 10న విడుదలవుతున్న లెనిన్

## నేడు తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్

అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన 'లెనిన్' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది.




# నేనూ కాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నా

నటి పరిణీత బోర్తకుర్



సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్‌పై ఎన్నో ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. చాలామంది భయంతో బయటకు చెప్పకుండా మౌనం పాటిస్తుంటే, కొంతమంది మాత్రం సమయం వచ్చినప్పుడు తాము ఎదుర్కొన్న చేదు అనుభవాలను ధైర్యంగా పంచుకుంటున్నారు. తాజాగా ప్రముఖ నటి పరిణీత బోర్తకుర్ కూడా తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఒక షాకింగ్ సంఘటనను బయటపెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పరిణీత బోర్తకుర్ సౌత్ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. సినీ రంగంలో చేదు అనుభవాలు తాను కూడా ఎదుర్కొన్నానని ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ పరిశ్రమలో ఒక మంచి విషయం కూడా ఉందని, ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో మన ప్రవర్తన కూడా కీలకంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తన కెరీర్ ప్రారంభ దశలో ఒక దక్షిణాది సినిమా కోసం తన ఫొటోలు షార్ట్‌లిస్ట్ అయ్యాయని సమాచారం వచ్చిందని పరిణీత చెప్పారు. ఆ తర్వాత ఆఫీస్‌కు వెళ్లగా అక్కడ మరికొందరు అభ్యర్థులు కూడా ఉన్నారని తెలిపారు. కొంతసేపటి తర్వాత తననే హీరోయిన్‌గా ఎంపిక చేశామని చెప్పి ఒప్పందంపై సంతకం చేయాలని కోరారని వివరించారు. ఆ సమయంలో అంతా సాధారణంగానే అనిపించిందని, సినిమా అవకాశం రావడంతో ఆనందపడ్డానని గుర్తు చేసుకున్నారు. అయితే ఆ తర్వాత జరిగిన సంఘటన మాత్రం తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనిదని ఆమె చెప్పారు. మొదట తన శరీర కదలికలు తెలుసుకోవాలని దర్శకుడు చెప్పడంతో డ్యాన్స్‌కు సంబంధించిన విషయమే మాట్లాడుతున్నారని భావించానని తెలిపారు. కానీ వెంటనే మన ఇద్దరి మధ్య శారీరక సంబంధం ఉండాలని కోరుకుంటున్నానని అతను చెప్పడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానన్నారు. అప్పటికి తన వయసు కేవలం 21 ఏళ్లు మాత్రమేనని, భయంతో గుండె వేగంగా కొట్టుకోవడం మొదలైందని చెప్పారు. వెంటనే అక్కడి నుంచి లేచి నిలబడి తాను ఆ సినిమా చేయనని చెప్పి బయటకు వచ్చేశానని వెల్లడించారు.ఆ సంఘటన తర్వాత వెంటనే తన తండ్రికి ఫోన్ చేసి జరిగిన విషయం మొత్తం చెప్పానని పరిణీత తెలిపారు. తన తండ్రి కూడా సినిమా అవసరం లేదని, వెంటనే ఇంటికి వచ్చేయమని చెప్పారని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆ దర్శకుడు ఫోన్ చేసి ఈ విషయం బయటకు చెప్పొద్దని, తాను కుటుంబానికి పెద్దవాడినని వేడుకున్నాడని వెల్లడించారు. సినిమాలో మంచి పాత్ర ఇస్తానని చెప్పినా, అలాంటి వ్యక్తితో కలిసి పనిచేయడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేసి ఆ అవకాశాన్ని పూర్తిగా తిరస్కరించానన్నారు. పని కోసం ఎప్పుడూ అక్రమ మార్గాలను ఆశ్రయించలేదని, కెరీర్ కంటే ఆత్మగౌరవానికే ఎక్కువ విలువ ఇచ్చానని పరిణీత బోర్తకుర్ స్పష్టం చేశారు. ఇక పరిణీత బోర్తకుర్ 'బేపన్నా', 'సావధాన్ ఇండియా', 'గుప్తా బ్రదర్స్', 'ఏక్ థా రాజా ఏక్ థీ రాణి' వంటి పలు టెలివిజన్ షోలతో ప్రేక్షకులకు చేరువయ్యారు.




# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

## నగర శివారులో జెట్ స్పీడ్‌తో చిత్రీకరణ

రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ-ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశాన్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట్' విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళిక కారణంగానే షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతోందని సమాచారం.



# ప్యారడైజ్ మూవీపై నాని ఫోకస్

## కొత్త చిత్రాలకు డేట్లు కుదరక నో




నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్ 'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ది ప్యారడైజ్‌పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తయిన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ-2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని-సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.నిర్మాతపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో నాని తన తదుపరి కమిట్‌మెంట్లను వాయిదా వేసి, 'ది ప్యారడైజ్'ను పూర్తి చేయడంపైనే పూర్తి దృష్టి సారించినట్లు సమాచారం.

# నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి

## నటి శ్రీలీల మనోగతం

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷-టg÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.

# గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్లో ఇంట్రా క్రికెట్ లీగ్ పోటీలు

**ముఖ్య అతిథులుగా డాక్టర్ రవి కృష్ణ, పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి.. -క్రికెట్ లీగ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రధానం**





**నంద్యాల జూలై 5( రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల జిల్లా బాబా నగర్ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆహ్లాదకరంగా ఇంట్రా స్కూల్ క్రికెట్ పోటీలను ఘనంగా నిర్వహించారు. గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను నిర్వహించగా ముఖ్య అతిథిగా ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ పాల్గొన్నారు. ఇంట్రా క్రికెట్ పోటీల్లో దాదాపు 8 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీలను విద్యార్థులు ఆహ్లాదకరంగా తిలకించి క్రీడాకారులను ఉత్సాహపరిచేలా కేరింతలు కొట్టారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, క్రీడలపై ఆసక్తి పెంచేలా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని చెప్పారు. క్రీడలు ఆడించేలా చరోచూపాలని క్రీడలతోనే విద్యార్థులకు మనోధైర్యం మేధాశక్తి పెరుగుతుందని గుర్తు చేశారు. మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడా పోటీల్లో పాల్గొనేలా చూడాలని తెలిపారు. ఇంట్రా క్రికెట్ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఉషా కళ్యాణి, స్కూల్ డీన్ బేగం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా నంద్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సందీప్,మేడా చంద్రశేఖర్,కోశాధికారిగా సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు.**

**- నంద్యాల లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం: డాక్టర్ రామకృష్ణారెడ్డి, న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు.**

**. నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించిన వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ.**




**నంద్యాల జులై 5 (రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల లయన్స్ క్లబ్ 2026- 27 వ సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్. జి.రవి కృష్ణ నూతన కార్య వర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షులుగా సందీప్,కార్యదర్శిగా మేడా చంద్రశేఖర్,కోశాధికారిగా సురేష్ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. వివిధ పదవులకు,వివిధ కార్యక్రమాల సబ్ కమిటీ చైర్మన్ లుగా పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

కొత్తగా లయన్స్ క్లబ్ లో చేరిన సభ్యులతో డాక్టర్ సహదేవుడు సభ్యత్వ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి, వెదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు సేవా తత్పరతతో, అంకితభావంతో, నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఆరోగ్య రక్షణ, విద్యా, స్వయం ఉపాధి కార్యక్రమాలు ప్రధాన ధ్యేయంగా లయన్స్ క్లబ్ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం కూడా ప్రజలకు నిరంతరం విస్తృత సేవా కార్యక్రమాలు నూతన కార్యవర్గం నిర్వహించాలని కోరారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ 206 దేశాలలో, 50 వేల క్లబ్ లలో 14 లక్షల మంది పైగా లయన్స్ సభ్యులతో అంతర్జాతీయ లయన్స్ క్లబ్ సేవా సంస్థ ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. "సర్వేజనా సుఖినోభవంతు" అని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని, "పరోపకారార్థం ఇదం శరీరం" అని ఇతరులకు సేవ చేయడం కోసమే మానవ జన్మ అని చాటిచెప్పిన భారతీయ సంస్కృతి అందించిన సేవా స్ఫూర్తితో నంద్యాల లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు 56 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. నూతన అధ్యక్షుడు సందీప్,కార్యదర్శి మేడా చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే రీతిలో వివిధ సేవా కార్యక్రమాలను ఈ సంవత్సరం చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని,నంద్యాల లయన్స్ క్లబ్ పేరు ఇనుమడింప చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అతిథులు డాక్టర్ రామకృష్ణారెడ్డి వెదుర్ల రామచంద్రరావు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ సహదేవుడు,గత సంవత్సరం అధ్యక్ష కార్యదర్శులు గా సేవలు అందించిన సోమేశుల నాగరాజు, తాతి రెడ్డి భాస్కర్ రెడ్డి,కోశాధికారి అమిదేల జనార్ధన్, రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్ లను ప్రత్యేక జ్ఞాపికలు,శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్ నంద్యాల లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా,రవి ప్రకాష్,భవనాసి నాగ మహేష్,కశెట్టి చంద్రశేఖర్,కశెట్టి వేణుమాధవ్, మహేశ్వర రెడ్డి, కన్నయ్య అధిక సంఖ్యలో లయన్స్ క్లబ్ సభ్యులు కుటుంబాల తో పాటు పాల్గొన్నారు.

# రక్త దాన శిబిరానికి విశేష స్పందన

**అధిక సంఖ్యలో తరలివచ్చిన యువకులు -తలసేమియ బాధితుల కోసం గురు రాఘవేంద్ర భారత్ గ్యాస్ రక్త దాన శిబిరం**

**మానవత్వాన్ని చాటిన రక్తదాతలు,యువకులు -స్వచ్ఛంద సేవాకార్యక్రమాలతో రాజంరెడ్డి కుటుంబ సభ్యులు**






**బండి ఆత్మకూరు జూలై 05 ( రిపబ్లిక్ న్యూస్) :**
బండి ఆత్మకూరులోని గురు రాఘవేంద్ర భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నిర్వహించిన రక్త దాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రాజం రెడ్డి సుజాతమ్మ ఆమె కుమారుడు రాజంరెడ్డి మనోహర్ రెడ్డిల స్థానిక గ్యాస్ గోడౌన్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు యువత, స్వచ్ఛంద సేవకులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో నంద్యాల బ్లడ్ బ్యాంక్ ఇంచార్జ్ బ్లడ్ అచ్యుత్ ఇతర వైద్య సిబ్బందితో కలిసి రక్త సేకరణ ప్రక్రియను చేపట్టారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం అనేది మరొకరి ప్రాణాలు కాపాడే మహాదానమన్నారు. ఒక రక్తదాత రక్తదానం పలువురి ప్రాణాలను కాపాడగలదని రక్త ప్రదాతల సేవలు కొనియాడారు. సమాజంలో ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని యువకులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందనీ ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాగా రాజంరెడ్డి కుటుంబ సభ్యులు ప్రజలకు నిత్యం ఏదోరకంగా ఇలాంటి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వం చాటుకుంటున్నారు.

**రక్తదానం చేసిన పోలీసు సిబ్బంది,మీసేవ నిర్వాహకుడు**

ఆదివారం గురు రాఘవేంద్ర భారత్ గ్యాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో బండి ఆత్మకూరు పోలీస్ సిబ్బంది సురేష్ రెడ్డి, మస్తాన్ రెడ్డి, మనోహర్ లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. వారితో పాటు స్థానిక మీసేవ నిర్వాహకుడు శ్రావణ్ కుమార్, బండి ఆత్మకూరు సబ్ రిజిస్టర్ కార్యాలయ సిబ్బంది ముంతల రమేష్ పాల్గొని రక్తదానం చేసి తల సేమియా చిన్నారులకు తమ వంతుగా చేయూత అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మాజీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వైసీపీ నంద్యాల తలసేమియా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డి. మురళి, సభ్యుడు హుస్సేన్ వలి, నంద్యాల బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ అచ్చు,గ్యాస్ సిబ్బంది షాబీర్ అలీ, రఫీ, ఇలియాస్, ఫిరోజ్ , చిరంజీవి,తదితరులు పాల్గొన్నారు.

# కె.వి.ఆర్. ఆస్పత్రిలో న్యూరాలజీ, నియోనేటల్, పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభం

**. డాక్టర్ జయ రామ కృష్ణ ఆధ్వర్యంలో ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ సెంటర్**

**. డాక్టర్ నిత్య ఆధ్వర్యంలో నియోనేటల్, చిన్నపిల్లల క్రిటికల్ కేర్ యూనిట్**

**. ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ**



**నంద్యాల జులై 5 (రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల సంజీవనగర్ లో డాక్టర్ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కె.వి.ఆర్ ఆసుపత్రిలో నూతనంగా న్యూరాలజిస్ట్ డాక్టర్ జయ రామ కృష్ణ ఆధ్వర్యంలో ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ విభాగం, నవజాత శిశు మరియు చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ నిత్య ఆధ్వర్యంలో నియోనేటల్ , చిన్నపిల్లల క్రిటికల్ కేర్ యూనిట్ ఆదివారం ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు,మాజీ రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు.
డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ నాగమణి,డాక్టర్ అనిల్,డాక్టర్ పనిల్ కుమార్ ఓ పి డి విభాగం, న్యూరాలజీ వార్డ్, నియోనేటల్, పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ యూనిట్ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయ రామకృష్ణ, డాక్టర్ నిత్య మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలు, వసతులతో ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ కేంద్రంలో పక్షవాతం వచ్చిన వారికి చికిత్సలు,నవజాత శిశువుల, చిన్నపిల్లల క్రిటికల్ కేర్ సేవలు అందిస్తామన్నారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలో అత్యాధునిక వసతులతో న్యూరాలజీ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. అనేకమంది వైద్యులు అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇప్పుడు నంద్యాలలోనే అందిస్తున్నారని,కర్నూల, హైదరాబాదు నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజలు ఇక్కడే వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ రామ సుబ్బారెడ్డి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ తనూజ, డాక్టర్ వసుధ, డాక్టర్ మాధవి, డాక్టర్ రాకేష్ రెడ్డి అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

# పసుపు కుంకుమలు అందజేత



**మహానంది, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్)**
మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లె గ్రామంలో ఆడబిడ్డ పెళ్లికి జనసేన పార్టీ తరపున పసుపు కుంకుమలను అందజేశారు. ఆదివారం జనసేన పార్టీ నాయకులు నల్లబోతుల మల్లికార్జున,బోనాసి ప్రసాద్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి పసుపు కుంకుమలను అందజేశారు. వారు మాట్లాడుతూ..జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో,నిత్యం కుల, మత బేధాలకు అతీతంగా సేవ చేస్తున్నట్లు తెలిపారు.

# గురువుకు ఘన స్వాగతం.. పదవి విరమణ వీడ్కోలు



**మహానంది, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్)**
మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీ ఆంగ్ల ఉపాధ్యాయునిగా వెంకటేశ్వర్లు పనిచేస్తూ పదవి విరమణ పొందారు. ఆదివారం పాఠశాల విద్యార్థులు డప్పులు వాయిస్తూ.. కోలాటాలు చేస్తూ ఆ ఉపాధ్యాయునికి ఘనంగా ఊరేగిస్తూ వీడ్కోలు సభకి స్వాగతించారు. అనంతరం పదవి విరమణ అభినందన సన్మాన సభను తోటి ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు దంపతులను గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి పూలమాల, శాలువతో ఘనంగా సన్మానించారు.సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారన్నారు.ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజమైందని, అంకిత భావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హుస్సేన్ భాష, వైస్ చైర్మన్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

# కొత్త బోరు మోటరు ఏర్పాటు



**మహానంది, జూలై 5, (రిపబ్లిక్ న్యూస్)**మహానంది మండలం గాజులపల్లె గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని తాగునీరు ట్యాంకు మోటారు మరమ్మత్తులకు గురైంది. ఆదివారం గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి స్పందించి కొత్త మోటరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ.. నీటి సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించిన సొసైటీ చైర్మన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బూత్ కన్వీనర్లు హుస్సేన్ భాష, జమాల్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com